# అవేకళ్ళు

నా కళ్ళు చెదిరిపోయినాయి. చప్పున ఆగేశాను ఆశ్చర్యంగా చూస్తున్నాను అమాంతం ఒక్క పరుగులో అక్కడికి వెళ్ళిపడదా మని పించింది, రోడ్డుమీద అటూ యిటూ విరామం లేకుండా కార్లు బస్సులు కదిలిపోతున్నాయి. కళ్ళు బాగా తెరుచుకుని మరీచూస్తున్నాను. రోడ్డు అవతల వైపు షాపుదగ్గర వయ్యారంగా నిలబడి మెలికలు తిరిగిపోతూ ఏదో మాట్లాడుతోంది. నేను ఆమెకు సూటిగా రోడ్డుకు యివతల వైపు బస్సుకోసం నిలబడివున్నాను. ఆమెను చూస్తుంటే నా తల తిరిగిపోతోంది. నా కళ్ళను నేను నమ్మలేక పోతున్నాను. కిలకిల నవ్వుతూ ఒక్కక్షణం నా వైపు తిరిగింది. నా వళ్ళు జలతరించింది అవేకళ్ళు. అదే నవ్వు. అదే మొహం. ఆమే!

అటు చూస్తున్నా నా ఆలోచనలు నా మనస్సు చాలా యేళ్ళు వెనక్కు పరుగెత్తినాయి. ఆ క్షణంలో అంతా నాకళ్ళకు

కట్టినట్టు కనిపిస్తోంది....

....నన్ను యెవరు యేమన్నా కూడా నాకు బాధలేదు మీరు నమ్మితేచాలు...

...నేను నమ్మకపోవటమనే ప్రశ్నేలేదు. నా విశ్వాసం ఒక్కటే నీకు ధైర్యం యిస్తుందంటే నాకు అంత కంటె సంతోషం యింకోటి లేదు....

....నేను అన్నీ పోగొట్టుకున్న తర్వాత నాకు మిగిలింది మీరే. మీరే నన్ను అపార్థం చేసుకుంటే యింకా నాకు యీ జీవితంలో దేని మీదా ఆశ లేదు...

'...నీ మీద నా కున్న అచంచల విశ్వాసాన్ని ఎంతో పవిత్రంగా అరాధిస్తావని అనుకుంటున్నాను. నా విశ్వాసం చాటున నువ్వు చెయ్యకూడని పని చేస్తావని నేను అనుకోవటం లేదు. కాని సంఘం నాచుట్టూ వున్న శ్రేయోభిలాషులు నన్ను ప్రశాంతంగా వుండనీయటం లేదు. ఇది నా మనో దౌర్బల్యం అని నేను అనుకుంటాను. అయితే యీ విషయం నీకు తెలియపరిస్తే నా హృదయ భారం యెంతో తగ్గినట్టు అనిపిస్తుంది..."

"మీ విశ్వాసమే నాకు పెద్దరక్ష... మీ విశ్వాసం సడలిపోయిన నాడు నేను యేది మాట్లాడినా యేది చేసినా మీకు వికృతంగానే కనపించవచ్చు నేను మాట్లాడే ప్రతి మాటలోనూ, నేను చేసే ప్రతి పనిలోనూ విపరీతార్థం కనిపించవచ్చు. అందుకనే మీరు మీ నమ్మకాన్ని పోగొట్టుకుని బాధపడకండి .."

తల విదిలించేశాను. ఎన్నెన్నో మాటలు ఎన్నెన్నో దృశ్యాలు స్ఫురణకు వచ్చేసి నామనస్సుని కల్లోల పరుస్తున్నాయి. ఆత్రాత్తుగా యేదోమాట యేదో సందర్భం గుర్తు కొస్తోంది

...నువ్వు నాకు యెంతో దూరంగా వున్నప్పుడు నా దానివి కాకపోతావేమోనని భయపడ్డాను. కాని మన పెళ్ళయిన తర్వాత మాత్రం నువ్వెంతో దూరంగా వున్నట్టే అనిపిస్తోంది. ప్రశాంతంగా గడుపుతున్న నా జీవితంలో నువ్వొచ్చి చిచ్చు పెట్టావు నన్ను బల హీనుణ్ణిచేశావు. నా మనస్సు వికలంచేశావు....నాకు చావాలని లేదు. కాని యెంత కాలం యిట్లా క్షోభ పడుతూ బ్రతకగలనో యేమొ తలుచుకుంటే నాకే భయంగా వుంది....

చప్పున కాళ్ళు క్రుంగిపోయినాయి. కూలబడిపోతానేమోనని భయమేసింది. అయాస పడుతూ బలవంతంగా అట్లాగే నిలబడి వున్నాను.

'.... ఎంతపని చేశావు బంగారపు బొమ్మరా. మనింటికి లక్ష్మిరా ఎవరో యేదో అన్నారని మంచీ చెడులు విచారించ కుండా అంత పని చేస్తావా....'

'అమ్మా... నన్నేమి అనకండి నాకు పిచ్చి యెత్తి పోతుంది.' నేను చేసిన ఘోరమైన పాపానికి జీవితాంతం శిక్ష అనుభవిస్తూనే వుంటా. మీరు యింకా నన్ను సూటిపోటి మాట లతో చిత్రహింస చెయ్యకండి. నాకీ శిక్ష చాలు నన్నిట్లా వదిలెయ్యండి ..'

"అయిపోయిందేమిటో అయిపోయింది. ఇహ యెన్నేళ్ళు ఈ నరకయాతన అనుభవిస్తావు. ఇక ఆ అమ్మాయి మన గడపలో అడుగు పెట్టదు. ఎక్కెడికెళ్ళిందో ఏమో! ఎన్నో వింటున్నాం ఎన్నో చూస్తున్నాం. ఏం జరిగినా ఆశ్చర్యం లేదు... మా మాటవిని ఇంకో పెళ్ళి చేసుకో...

"ఇంకో పెళ్ళా!.... ఇది బొమ్మలాట కాదు... తెలుసా...." మీకు నోరెట్లా వచ్చింది ఆ మాట అంటానికి... వెతుకుతాను, ఎక్కడున్నా తీసుకొస్తాను. ఏ పరిస్థితుల్లోవున్నా నేను మనింటికి తీసుకొస్తాను తెలిసిందా! నాతో పెళ్ళి మాట తమాషాక్కూడా అన కండి. నా గుండె బ్రద్దలయి పోతుంది. ఇప్పుడు నే చేసిన పాపం అన్యాయం చాలు. ఇంకా నా చేత యే అక్రమాలు చేయించ కండి...."

ఎక్కడెక్కడి వెతికానో యెన్ని చోట్ల చూశానో అంతు లేదు గదా! భగవంతుడనే వాడున్నాడు! ఇన్నేళ్ళుగా పరితపించి ఆవేదనంతా గుండెల్లో యిముడ్చుకున్నాను. నా శిక్ష గడువు పూర్తి అయింది విడుదల సమయం వచ్చేసింది నన్ను భగవంతు డనేవాడు కనికరించాడు. అయినా నేను యేమొహం పెట్టుకుని వెళ్ళగలను! నే చేసిన ఘోరమైన అన్యాయానికి నన్ను క్షమి స్తుందా! ఇన్నేళ్ళుగా దారుణమైన యీఎడబాటును ఓక్షణంలో మరిచి పోయి నన్ను ఆహ్వానిస్తుందా! ఏమో చేసిన నేరానికి పశ్చాత్తాపా నికి మించిన శిక్ష యింకొకటి లేదు నాలో నేను మధన పడుతు న్నాను.

కిలకిల నవ్వుతూ తీగలాగ సాగిపోతుంటే మళ్ళీ నా కళ్ళు చెదిరిపోయినాయి నన్ను నేను చూసుకున్నాను. ఎంతో ఆశ్చర్యం

వేసింది. ఆమె వైపు చూశాను. అదే మొహం! అవే కళ్లు ఆ పొడుగాటి చేతులు నన్ను చుట్టేసిన దృశ్యం క్షణంలో నా కళ్ళల్లో మెరిసి వళ్లు ఝల్లుమన్నది నా గుండె దడ దడమని కొట్టుకోవడం మొదలు పెట్టింది ఇహ నేను. ఒక్క క్షణం ఆగలేకపోయాను. అటూ యిటూ చూస్తూవచ్చేపోయే వాహనాలను తప్పించుకుని అమాంతం ఆ రోడ్డుఅవతలవైపు వెళ్ళిపోయాను. సూటిగా నా యెదురుగా నిలబడ్డటునా మొహంలోకి చూస్తూ ఒక్క క్షణం ఆగింది. నా ఆవేశం హెచ్చిపోయింది. నన్ను నేను అదుపులో వుంచుకోలేక పోయాను.ఆ క్షణంలో నన్ను నేను మరిచే పోయాను

పెద్దగా నిట్టూరుస్తూ 'కస్తూరీ!' బిగ్గరగా గొంతుక విప్పి అరిచాను.

ఉలిక్కిపడి వికటంగా నవ్వింది.

కస్తూరి!.... కస్తూరి! పక పక నవ్వుతూ "మా అమ్మ చచ్చిపోయింది. నా పేరు శారద మీరెవరండీ!" అంటూ విడ్డూరంగా చూసింది.

ఉన్నవాణ్ణి వున్నట్టుగా కూలబడి పోయాను.

---